

# బావా మరదళ్లు

కొడవటిగంటి కుటుంబరావు

రంగనాధరావుకు అయిదుగురు మేనమామలు. వారి కయిదుగురకు అయిదుగురు కూతుళ్ళు, అయిదుగురు మేనమామలకు అతను ఒకడంటే ఒకడే మేనల్లుడు.

ఇందులో విచిత్రం ఏమీ లేదు, కాని అయిదుగురూ అతనికి ఈడయిన పిల్లలే కావటం కొంతవరకు అసామాన్యమైన విషయం. దీన్నికూడా తలదన్నిన విషయమేమిటంటే, అయిదుగురు మేనమామలు "నా పిల్లను చేసుకో!" అంటే "నా పిల్లను చేసుకో!" అంటూ ఒకరిమీద ఒకరు పోటీ తగిలారు.

"నన్నుచూస్తే నా మేనమామల కెంత ప్రేమ" అని రంగనాధరావు ఆశ్చర్యపడలేదు. కట్నం తీసుకోకుండా పదేకరాల భూవసతితో, రెండువేల ఖజానాతో, చూడ ముచ్చటైన అల్లుళ్లు కావాలన్నప్పుడల్లా దొరుకుతారా ఏమిటి!

త్రిమూర్తిగారి కేం చెయ్యటానికీ పాలు బోలేదు. ఒకరా, యిద్దరా? అయిదుగురు బావమరదులు, కొడుకు పెళ్ళి ఎట్లా ఉన్నా, ముందు బావ మరదుల మర్యాద-తాత్కాలికంగా తెచ్చి పెట్టుకున్నది—భరించటం దుస్సాధ్యంగా ఉంది. రోజు తిరిగేలోపల ఈ పంచ పాండవుల్లో ఎవరో ఒకరు అట్లా మొహం చూపించి "ఏమండో, బావగారు! కులాసా? అమ్మాయి కులాసా? అబ్బాయి కులాసా! చాలా రోజులైంది దర్శనంచేసి!" ("కిందటివారమే కామన్ట్రా వస్తివి?" అని త్రిమూర్తిగారు!) మళ్లీ ఎట్లా వచ్చాడో అట్లా మాయం కావటం జరిగి తీరవలిసిందే.

అక్కడికీ త్రిమూర్తిగారు సామదాన భేదాలు ప్రయత్నించి చూశాడు, మొదట ఈ వివాహ ప్రస్తావన వచ్చినప్పుడు విషయం వేళాకోళం కిందికిదించి బిగ్గరగా నవ్వేశాడు. ఆ తరవాత ప్రతి బావ మరిదితోను అతని పిల్లకు దివ్యమైన సంబంధం తీసుకువస్తానని వాగ్దత్తాలు చెయ్యటం మొదలు పెట్టాడు. అట్లాగూ పని కాకపోతే ఏమిటి చెయ్యటం?

"అబ్బాయి, నీ పిల్లనే చేసుకుందామని ఉంది, చెప్పొద్దూ! అయితే, ఏం? మీ పెదవాడు (సందర్భాను సారంగా, రెండోవాడు, మూడోవాడు, నాలుగోవాడు, కడసారివాడు) నీకన్న ముందడిగాడు. కాదూ మరి

కూడ బలుక్కు రండి!'' అనటం మొదలు పెట్టాడు త్రిమూర్తిగారు.

ఈ పాచిక పారినట్టే కనపడ్డది.

''ఏంరా, బావ నాకూతుర్ని రంగడికి చేసుకుంటే నువ్వడ్డం తగులుతావుటే?''

''అరే, నాకూతుర్ని చేసుకుంటేనువ్వో? మర్యాదగా విరమిస్తావేం?''

''ఛా! నాకూతుర్నే చేసుకుంటాడు బావ!''

''ఛూ! నాకూతుర్నే చేసుకుంటా డసలు!''

కాని త్రిమూర్తిగారి మోసం బయటపడ్డది. నాలుగు తలలూ కలిసేటప్పటికి బావగారు దొరికి పోయినాడు.

''ఇట్లా కాదర్రా! మనలో మన కెందుకు పోట్లాట'' అందరి పిల్లల్నూ ఒక్కడి కిట్లా ఇస్తాం!''

''అయితే లాటరీ వేద్దాం!'' అన్నాడు చిన్నవాడు. వాడు లాటరీల్లో ఎప్పుడూ టిక్కట్లు కొంటుండేవాడు. వాడి కా విషయం బాగా తెలుసు.

''నువ్వ కాస్సేపు నోరు మూస్తావుట్రా, చిన్నవాడా? ......మన మయిదుగురమూ ఒక బాడీగా వెళ్ళి, 'మా అయిదుగురిలో ఎవరితో వియ్యమందుతావు? చెప్పు! మా కేమీ కోపంలేదు. యిష్టంవచ్చినవాణ్ణి కోరుకో మిగతా వాళ్లం విరమిస్తాం!' అని చెప్పేద్దాం, సరా?''

''సరే!''

''అంతేనా!''

''అందరూ ఒప్పుకన్నారా?''

''పెద్దవాడికీ జై! లాటరీకీ ఊడీ!''

ఈ వంచకాన్ని చూసి త్రిమూర్తిగారు నిర్ఘాంత పోయి నారు. ఇటువంటి ఘాటయిన ఎత్తు ఏదో వేస్తారు బావ మరుదులని ఆయన అనుకుంటూనే ఉన్నాడు. అను కున్నంతా అయింది.

''అబ్బాయిలూ! దివ్యమైన ఆలోచనే చేశారు. కాని నాకు మీ అందరిమీదా సమానమైన అపేక్షేనని మరిచి పోయినారు. అందుచేత నా నోటిమీదిగా నేను చెప్పను.''

''అట్లా తప్పించుకుంటే వల్లకాదు!''

''ఇది శుష్క అన్యాయం!''

''నువ్వ మాకు మళ్ళీ టోపీ వెయ్యాలని చూస్తు న్నావు!''

''నాన్సెన్స్! లాటరీలో మా మా అదృష్టాలు పరిశీ లించ నివ్వవా ఏమిటి నువ్వ?''

''ఇశ్శో! కామోష్! ఏమిటీ సంత? మీ ఎదటనే రం గణ్ణి పిలుస్తాను. మీ పిల్లల్లో ఎవత్తె వాడి కిష్టమైతే ఆ పిల్లను చేసుకుంటాను! సరేనా?''

అన్నదమ్ములు ఒకరి మొహాలు ఒకరు చూసుకుని ''సరే, రానీ!'' అన్నారు.

రంగనాధరావు వచ్చాడు.

''నాయనా, రంగడూ! వీళ్ల పిల్లల్లో నీకు ఎవర్నిచ్చి పెళ్ళి చెయ్యమన్నావు?'' అన్నాడు తండ్రి.

రంగనాధరావు ఒక్కక్షణం ఆలోచించాడు. అం దరూ ఊపిరికూడా బిగబట్టి నిశ్శబ్దంగా ఉన్నారు.

''శకుంతల!'' అన్నాడు రంగనాధరావు.

''లకీ ఛాన్స్! లాటరీకీ జై!'' అని కడసారివాడు, పెద్ద పెనుబొబ్బ పెట్టి కాబోయే అల్లుణ్ణి అమాంతం వా టేసుకున్నాడు. మిగిలిన నలుగురూ ఒక్కసారి మాట్లా డటంవల్ల త్రిమూర్తిగారి కేమీ అర్థం కాలేదు.

''మోసం...నువ్వ మా...చే...ముగ్గురికీ...ఒకే చి ...స్తావుగా...న్ననా...పోట్లాట...దూ!...డాకా... పెట్టా...చుకో!...లని మా...నీ లాటరీ...సినవా...'' ఇదేవరస.



అంతా కలిసి తన్నూ తన చిన్న బావమరిదిని బెదిరిస్తున్నారని త్రిమూర్తిగారు అర్థం చేసుకున్నాడు.

రంగనాధరావుకూ శకుంతలకూ పెళ్ళి స్థిరపడ్డ మరుక్షణం పెద్దవాళ్ల పిల్లలందరికీ ముహూర్తాలుకూడా పడిపోయినై. కోపం కొద్దీ నాలుగు ముహూర్తాలుకూడా శకుంతల వివాహ ముహూర్తానికి ముందే ఏర్పాటు చేశారు.

శకుంతలను కోరుకోటంలో రంగనాధరావు తొందరపడలేదు. అతనికి మిగిలిన మరదళ్లందరికన్నా శకుంతలను చూస్తే ఎక్కువ అభిమానం. పందొమ్మిది సంవత్సరాలు పైబడ్డా అతని కింకా శరీరవాంఛ అతని దృష్టిని మసక పరచలేదు. అట్లా జరిగితే అతని మనస్సు అప్పుడప్పుడే అవయవ సమృద్ధి పొందుతున్న జయలక్ష్మి మీదికే పొయ్యేది. అతనికి జయలక్ష్ములూ విజయలక్ష్ములూ శకుంతలముందు ధూపానికి కొరగేటట్టు లేరు. శకుంతలలో తన్ను ఆకర్షించే దేదో ఉంది. ఆ పిల్లతో ఇంతకాలనించీ పరిచయమైనా అరంకానిదీ అర్థంచేసుకోవలసిందీ ఏదో ఉంది. శకుంతలను అర్థం చేసుకుంటూ ఒక జీవితం గడపవచ్చును. మిగిలినవాళ్లంతా తాటాకు బొమ్మలల్లే దబ్బున పాత బడిపోయినారు. వాళ్లలో ఆవింత కలిగించే వస్తువు లేదు.

కనీసం రంగనాధరావు అభిప్రాయం అదీ.

ముందు జరిగింది పెద్దవాడి కూతురు జయలక్ష్మి పెళ్ళి. కమలమ్మ మొగుణ్ణి (అంటే మనం ఎరగని వ్యక్తి కాదు. త్రిమూర్తిగారు!) పెళ్లిళ్లకు పిలవాలా వద్దా అని చర్చించటానికి చతుష్టయం కలిసింది. మొదట పిలవొద్దనే తీర్మానం అయింది కాని అంతకన్న పిలవటమే చెప్పుదెబ్బ కొట్టినట్టుంటుందని నిశ్చయించారు. ఎందుకంటే, ఒకవేళ పిలవకపోతే "నా కొడుక్కు చేసుకోలేదని ఏడుస్తున్నారు" అనుకోట్ట కమలమ్మ మొగుడు. అటువంటి కారణమే చూసుకుని కడసారి వాణ్ణికూడా పిల్చారు.

పెళ్ళిపందిట్లో రంగనాధరావు శకుంతలా కలుసుకున్నప్పుడు బావ మరదళ్ళి నవ్వుతూ పలకరించాడు శకుంతల నవ్వుతూ పలికింది. తమ ఇద్దరికీ వివాహం కాబోతున్నదని రంగనాధరావు సంతోషించాడు. కాని అకస్మాత్తుగా శకుంతల కేం దుర్బుద్ధి పుట్టిందో తెలేదు, తన్ను తప్పించుకు తిరగటం మొదలు పెట్టింది. అతను

అవకాశం చూసి పలకరించకపోతే కని బొమ్మలు ముడేసి అవతలికి జారుకుంది.

ఇది మొదటిసారి జరిగినప్పుడు రంగనాథరావు ఆశ్చర్య పడ్డాడు. ఒకటి రెండు సార్లయిన తరవాత ఆందోళన పడ్డాడు. తరవాత అతని భావాలు పట్టరాని కోపంగా పరిణమించినై.

ఈ ఆవేదనలో జయలక్ష్మి అతని దగ్గరకొచ్చి "ఏం బావో! నీకు దక్కకుండా తప్పించుకున్నాను చూశావా!" అంది.

"పోవే, డబ్బా!" అన్నా డతను అణుచుకోలేని ఉద్రేకంతో.

రంగనాథరావుకు ఆలోచించిన కొద్దీ గుబులు జాస్తయింది. ఇది ఇంతే కామాలు! నిజమే! మొగుడు పెళ్ళాలు ఎప్పుడూ విరోధంగా ఉంటారు. ఎంతమందిని చూడటం లేదు? వెధవ నవలల్లో అన్నీ అబద్ధాలు రాస్తారు కాని, జీవితం ఇంతే. తను శకుంతలతో సరిగా మాట్లాడ దలుచుకుంటే పెళ్ళి చేసుకోకుండా ఉండి ఉండవలసింది!

ఇప్పుడు మాత్రం ఏం మునుచుకుపోయింది? ఈ పెళ్ళి పడకుండా చెయ్యరాదూ తను? లేచిపోతే సరి. నాకీ పెళ్ళి వద్దని అమ్మతో చెబితే?

చెప్పాడు! ఏముంది? అమ్మ కోప్పడ్డది.

ఆ లేచిపోవటంకూడా ఎట్లాగో పడకపోయింది.

అతనికీ శకుంతలకూ జయప్రదంగా వివాహమయింది. ఆత్మహత్య చేసుకుందామన్నంత విరక్తి కలిగిం దతనికి.

గృహ ప్రవేశమయింది. మూడు నిద్దర్లయినై. తిరిగి అతన్ని అత్తవారింటికి తీసికెళ్లారు.

అక్కడ అతను దాదాపువారం రోజులున్నాడు. పద హారో రోజు పండుగ సమీపిస్తున్నది. శకుంతల చర్య అతనికి అసహ్యంగా ఉంది. ఆ పిల్ల ఇంచుమించుగా ఖించల్లే ప్రవర్తిస్తున్నది. అట్లా కనపడుతుంది తళుక్కున మరుక్షణం ఎక్కడికో పోతుంది మాయమై. ఈ మెరపు మెరిసినప్పుడల్లా అతనికి వర్ణించటానికి వీల్లేనంత కోపం, చిరాకు, అసహ్యం, దుఃఖం కలుగుతున్నై. ఏం చెయ్యాలి?

అప్పటికి పది పదిహేను రోజుల్నించీ ఎండ పేల్చేస్తున్నది, మళ్ళీవచ్చే సంవత్సరందాకా రానుగా అన్నట్టు. ఆరోజు మధ్యాన్నానికల్లా ఎక్కణ్ణించి వచ్చినయ్యో దేవుళ్ళల్లే నల్లని మేఘాలు జయధ్వానాలు చేసుకుంటూ. ఆకాశమంతా ఆవరించినై. రంగనాథరావు వాటినే మనస్సులో ఉంచుకుని తల్లి ఒళ్లో పిల్లవాడల్లే నిద్దరపోయినాడు.

అతనికి నిద్రా భంగం అయేటప్పటికి ఉరుములే కాక మరి రొండు శబ్దాలుకూడా వినపడుతున్నై. వంటింటో అత్తగారేవో చేస్తున్నది అల్లుడి ఫలహారార్థం. మధ్యనడవలో శకుంతల ఏదో పాడుతున్నది.

రంగనాథరావు మెల్లిగా లేచి తనుపడుకున్న గది తలుపు సందుల్లోనించి చూశాడు శకుంతల చాపమీద సగం కూర్చుని సగం పడుకుని ఏవో రాసుకుంటున్నది.

అతనట్లా చూస్తుండగానే వంటింటో నించి ఆమె తల్లి "ఏమిటే, అమ్మాయి! ఆరాగాలూ? నీ మొగుడక్కడే పడుకుంటేనూ!" అంది.

శకుంతల తలయినా ఎత్తకుండానే "బావ పడుకుని నిద్దర పోతున్నాడులేవే! ఒకటే గోలా!" అంది.

రంగనాథరావు మనసు పొంగిపోయింది. ఇదీ తన శకుంతల! ఏదో పొరపాటు జరిగింది! అతను మెల్లిగా తలుపు తెరిచాడు. సగం పడుకున్న శకుంతల నిటారుగా లేచి నిల్చుని పుస్తకం అక్కడే వదిలిపెట్టి పారిపొయ్యే ప్రయత్నంలో ఉంది.

"మాటే శకుంతలా!" అన్నాడు బావ.

ఒకసారి వంటింటి వైపుచూసి శకుంతల వచ్చింది.

"ఏమిటి నీకీ దుర్బుద్ధి? నన్నుచూసి ఎందుకిట్లా పారిపోతున్నావు! ఇందుకా నిన్ను ఏరికోరి చేసుకుంది!"

"నన్నారోజున—జయలక్ష్మి పెళ్లిలో—ఎంత ఎగతాళి పట్టించి ఏడిపించారో తెలుసా? ఇప్పుడూ ఖూ అమ్మ చూడరాదూ!"

"అన్నట్టు అత్తయ్య ఏమిటో చేస్తున్నదే!"

"బజ్జీలు."

అయితే నా క్కావాలని కొసిని పట్టుకొస్తావా!"

"ఊ."

“ఉండు! ఏమని అడుగుతా మీ అమ్మను?”

“బావకు ఆక లవుతున్నదిట! ‘కాసిని బజ్జీలు పెట్టవమ్మా!’ అని అడుగుతాను!” అంటూ శకుంతల పరిగెత్తింది.

ఒక్క చల్లనిగాలి పొరవీచింది, భోరున తొలకరి వర్షం ప్రారంభమైంది.

కాలం ఒక తీరుగా ఉండదు. ప్రతి కథా ఎప్పుడో ఒకప్పుడు కంచికి వెళ్లి తీరాలిసిందే! జీవితం మాస పత్రికల నలంకరించే స్థానంనించి దిగి రావలిసిందే!......

ఇప్పుడు శకుంతల మొగుడిమీద ఎంతో కోపంవస్తే “ఏమిటి, బావా!” అంటుంది. తప్పు లేకపోతే అందరు పెళ్లాలల్లే “ఏమండీ” అనే పిలుస్తుంది!

---


## చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

# గొనోకిల్లర్ (రిజిష్టర్డు)

కృత్రిమములకు జాగ్రత్త “కోడి మార్కు”ను చూచి కొనుడు.

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలననుగూడ లాభము లేకపోయినయెడలను, కడపటిప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గొనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రముపోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. శగవ్యాధి (గొనోకోకసు) వలన మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, మూత్రద్వారముయొక్క చుట్టు వుండు పొరయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరముల జబ్బు మున్నగువ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను) పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వీ. పి. చార్జీ ప్రత్యేకము. అడ్రసు:—డాక్టరు డి. యన్. జసాని, గిర్‌గాను వెనుకరోడ్డు, బొంబాయి, 4.

Dr. D. N. JASANI, Girgaon Back Road, Bombay, 4.
Madras Agents :—DADHA & Co., 52, Naіnіappa Naіck St., P. T., Madras.


---


మీకు కావలసిన చక్కని స్వదేశీ సిల్కు యుడుపులు, గుడ్డలు, పలువిధములైన చీరెలు, జాకెట్టు రకములును,

కేశవరామ్ అండు కంపెని,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.